


బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి మద్దతు తెలుపుతున్న బ్రాహ్మణపల్లి యువకులు



శివ్వంపేట: సునీతాలక్ష్మారెడ్డి నామినేషన్‌కు పింఛన్ డబ్బులు అందజేస్తున్న వృద్ధులు

# బీఆర్‌ఎస్ విజయం ఖాయం

- ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, అభ్యర్థి సునీతారెడ్డి

నర్సాపూర్, నవంబర్8: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందుతుందని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నర్సాపూర్ మున్సిపాలిటీలోని మొదటి వార్డులో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గడపగడపకూ తిరుగుతూ బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలు వివరించి, కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా ప్రతి గడపకూ అందుతున్నాయన్నారు. తెలంగాణలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని కొనియాడారు. ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారని, నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి పనులే సునీతారెడ్డి విజయానికి నాంది పలుకుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు హబీబ్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

**సునీతమ్మ వెంటే మా ప్రయాణం**

బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి రోజురోజుకూ ప్రజల మద్దతు పెరుగుతున్నది.మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన యువకులు బుధవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డిని కలిసి మద్దతు తెలియజేశారు. మా ప్రయాణం సునీతాలక్ష్మారెడ్డి వెంటేనని, తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ వివరించి 30న జరిగే పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటు వేసి సునీతారెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో బ్రాహ్మణపల్లి యువకులు పాల్గొన్నారు.



నర్సాపూర్ మున్సిపల్ మొదటి వార్డులో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, అభ్యర్థి సునీతారెడ్డి

## అభిమానం చాటిన వృద్ధులు

శివ్వంపేట, నవంబర్ 8: శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన ఇద్దరు వృద్ధులు బీఆర్‌ఎస్ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డిపై అభిమానాన్ని చాటుకున్నారు. బుధవారం చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన ఆర్.యాదగిరిరావు, మహ్మద్ గౌస్‌లు వారికి వస్తున్న వృద్ధాప్య పింఛన్ ఒక నెల డబ్బులను గోమారం గ్రామంలోని సునీతాలక్ష్మారెడ్డి నివాసానికి వెళ్లి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పబ్బ రమేశ్‌గుప్తాతో కలసి నామినేషన్‌కు తమ డబ్బులను ఉపయోగించుకోవాలని సునీతాలక్ష్మారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గూడురు యాదాగౌడ్, ఏదుల్లాపూర్ మాజీ సర్పంచ్ కల్లూరి వెంకటేశ్, నర్సింగరావు, జిట్ట కుమార్ ఉన్నారు.

## నర్సాపూర్‌లో 5 నామినేషన్లు దాఖలు

నర్సాపూర్, నవంబర్8: నర్సాపూర్ పట్టణంలో బుధవారం ఐదు నామినేషన్లు దాఖలు చేశారని ఆర్‌వో శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి తరపున బీఆర్‌ఎస్ శ్రేణులు, కాంగ్రెస్ పార్టీ తరపున ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ రెండు సెట్లు, బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్ తరపున అతడి భార్య నామినేషన్లు దాఖలు చేశారని ఆర్‌వో వెల్లడించారు.



## స్ట్రాంగ్‌రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రత

నర్సాపూర్, నవంబర్ 8: స్ట్రాంగ్‌రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా అధికారులకు సూచించారు. 2023లో భాగంగా స్థానిక బీవీఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ కెమెరాలు 24 గంటలు పనిచేయాలని ఆదేశించారు.

## సునీతారెడ్డి తరుపున నామినేషన్ దాఖలు

నర్సాపూర్, నవంబర్8: నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి తరపున మొదటి నామినేషన్ పత్రాలను ఆర్‌వో శ్రీనివాసులుకు బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులు అందజేశారు. జడ్పీటీసీ బాబ్యానాయక్, హత్నూరా ఎంపీపీ నర్సింహులు, సునీతారెడ్డి సోదరుడు శ్రీనాథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సూరారం నర్సింహులు, మిస్కిన్‌ఆలీ ఆర్‌వో కార్యాలయానికి వెళ్లి నామినేషన్ పత్రాలను సమర్పించారు.

## నేడు శ్రీగురుపీఠం శిలన్యాస కరపత్రిక ఆవిష్కరణ

శివ్వంపేట, నవంబర్ 8: శివ్వంపేట మండలం గూడూరులో నిర్మించతలపెట్టిన శ్రీగురుపీఠం దేవాలయానికి సంబంధించి శిలన్యాస కరపత్రిక నేడు (గురువారం) ఆవిష్కరిస్తామని శ్రీగురుపీఠం చైర్మన్ హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్దగొని శివకుమార్‌గౌడ్ బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వేద పండితులు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ వెంకటరాంరెడ్డి హాజరవుతున్నారని, గురువారం ఉదయం 8:30 గంటల వరకు భక్తులు, గ్రామస్తులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

## చండూర్ పంచాయతీ ట్రాక్టర్ బోల్తా

చిలిపిచెడ్, నవంబర్ 8: మండలంలోని చండూర్ గ్రామపంచాయతీ ట్రాక్టర్ చిలిపిచెడ్ ప్రధాన రహదారిపై అకస్మాతుగా బోల్తా పడింది. పంచాయతీ సిబ్బంది హరితహారం మొక్కలకు నీళ్లు పడుతుంటే ప్రమాదవశావత్తు ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదు.

## 11న మాదిగల విశ్వరూప మహాసభ

రామాయంపేట, నవంబర్ 8: హైదరాబాద్‌లో ఈనెల 11న జరిగే 'మాదిగల విశ్వరూప మహాసభ'ను మాదిగలు, ఉపకులాలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్యాల కిషన్ పేర్కొన్నారు. బుధవారం రామాయంపేట పట్టణంలోని మెదక్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ ఉపకులాల కరపత్రాలను ఆవిష్కరించారు. మహాసభకు మెదక్ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి మాదిగలు, ఉపకులాలు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలి పిలుపునిచ్చారు.

## పోలీసు తనిఖీల్లో మద్యం పట్టివేత

కొల్చారం, నవంబర్ 8: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొల్చారం మండలం రాంపూర్ వద్ద పోలీసులు బుధవారం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. ఈ వాహన తనిఖీలో ఓ కారులో (టీఎస్ 15 ఇఆర్0222) రూ.19,800 విలువ చేసే 18 లీటర్ల లిక్కర్ బాటిళ్లు పట్టుకున్నట్లు ఎస్సై మహ్మద్ గౌస్ వెల్లడించారు.

## కోనాపూర్ పాఠశాలలో మాక్ పోలింగ్

రామాయంపేట రూరల్, నవంబర్8: రామాయంపేట మండలం కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదిరి ఎన్నికలు (మాక్ పోలింగ్) బుధవారం నిర్వహించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజయ్య, భాగ్యలక్ష్మి, రషీద్, భగవాన్‌దాస్, దేవేందర్, కల్పన పాల్గొన్నారు.



కోనాపూర్: మాక్ పోలింగ్‌లో జడ్పీహైస్కూల్ విద్యార్థులు

# నర్సాపూర్ కాంగ్రెస్ బీ ఫామ్ నాకే..

- అధిష్టానం చెప్పింది: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ వెల్లడి

నర్సాపూర్, నవంబర్ 8: నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ తనకే ఇస్తామని అధిష్టాన పెద్దలు చెప్పారని, అందుకే నామినేషన్ వేశానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ తరపున బీ ఫామ్ అందుకున్న ఆవుల రాజిరెడ్డి నామినేషన్ వేయగా, టికెట్ ఆశించి భంగపడ్డ గాలి అనిల్‌కుమార్ కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగానే నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా గాలి అనిల్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ అధిష్టానం నాకు బీ ఫామ్ ఇస్తానని మాట ఇచ్చింది. అందుకే కాంగ్రెస్ తరపున నామినేషన్ వేశానని వెల్లడించారు. 9 లేదా 10వ తేదీలోపు బీఫామ్ ఇస్తామని చెప్పారని, తప్పకుండా అధిష్టానం నాకే బీఫామ్ ఇస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ర్యాలీలో కలెక్టర్‌కు చిక్కులు**

కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ నామినేషన్ సందర్భంగా చేపట్టిన ర్యాలీలో కలెక్టర్ కాన్వాయి చిక్కుకుపోయింది. టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ బుధవారం నామినేషన్ వేయడానికి భారీ జనప్రదర్శనతో వెళ్తుండగా నర్సాపూర్ నుంచి మెదక్ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామైంది. మెదక్ నుంచి నర్సాపూర్ వస్తున్న కలెక్టర్ వాహనం సుమారు గంటసేపు ట్రాఫిక్‌లో చిక్కుక్కుపోయింది. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని, అభ్యర్థి ఖర్చు ప్రతి పైసాను కౌంటిం గ్ చేయాలని ఆఫీసర్లను ఆదేశించారు.



కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి గాలి అనికుమార్ ర్యాలీలో చిక్కుకుపోయిన కలెక్టర్ కాన్వాయి

## కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలి

**శివ్వంపేట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్**

శివ్వంపేట, నవంబర్ 8: శివ్వంపేట మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలను బుధవారం ప్రారంభించారు. మండలంలోని దొంతి గ్రామంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, చిన్నగొట్టిముక్ల గ్రామంలో సర్పంచ్ బాలమణి నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుడిగా పని చేయాలని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమాల్లో ఆత్మకమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు నాయక్, ఎంపీటీసీలు దశరథ, ఇందిరాశ్రీనివాస్, సీనియర్ నాయకులు పిట్ల సత్యనారాయణ, షఫీయోద్దిన్, పాపారావు, ఉపసర్పంచ్ సత్యనారాయణ, చాకలి సత్యనారాయణ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట: మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

## పఠనాసక్తి బాధ్యత ఉపాధ్యాయులదే

- విద్యార్థులకు అల్పాహారం అందించాలి: డీఈవో రాధాకిషన్

నిజాంపేట/రామాయంపేట, నవంబర్8: గ్రంథాలయాల ద్వారా విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచే బాధ్యత ఉపాధ్యాయులదే నని డీఈవో రాధాకిషన్ అన్నారు. బుధవారం నిజాంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రామాయంపేట పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్వహించిన స్కూల్ కంప్లెక్స్ సమావేశానికి ఎంఈవో నీలకంఠంతో కలిసి డీఈవో హాజరై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో 'తొలిమెట్టు' కార్యక్రమంపై మాట్లాడారు. విద్యార్థులపై ఎలాంటి నిర్లక్ష్యం, పక్షపాతం లేకుండా విద్య నేర్పించినప్పుడే ఆ గురువుకు సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. నాణ్యమైన విద్య కావాలంటే ప్రభుత్వ బడుల్లోనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రామాయంపేట కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. నిజాంపేట కార్యక్రమంలో కల్వకుంట, నిజాంపేట ప్రధానోపాధ్యాయులు మాధురిదేవి, రవీందర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీ రాజు పాల్గొన్నారు.